క్లుప్తంగా

భూసార పరీక్షలపై అవగాహన



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షలు నిర్వహించేందుకు గాను మట్టి నమూనా ఎలా సేకరించాలో, భూసార పరీక్ష కేంద్రానికి పంపేటప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు చార్ట్ రూపంలో అవగాహన కల్పించారు. భూసార పరీక్షల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ నరేష్, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

వెంకట నర్సయ్య స్మారక వ్యాసరచన పోటీలు

పెదకూరపాడు: పెదకూరపాడు గ్రామానికి చెందిన కవి బ్రహ్మ ఏటుకూరి వెంకట నర్సయ్య 75వ వర్ధంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు జరుగుతాయని పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్, ప్రజా కవి దర్శి శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ వ్యాసరచన పోటీలు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించబడునని తెలిపారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబర్ 12వ తేదీన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమగును. వ్యాసరచన పోటీ నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువాపై రాయవలసి ఉంటుంది. ఆసక్తి గల వారు పెదకూరపాడు అభివృద్ధి వేదిక (పీడీఎఫ్), కన్వీనర్, ప్రజాకవి దర్శి శేషారావు- 8790682858, ప్రధానోపాధ్యాయులు కేవీ రమణ - 8309754060, నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులు కోటేశ్వరరావు - 7013511748 నంబర్‌లలో సంప్రదించగలరు.

అయ్యప్ప స్వాముల సద్ది ప్రారంభం



సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ తల్లి దేవాలయంలో మాలధరించిన అయ్యప్ప స్వాముల సద్దిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు మాలధారులు, టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, నాయకులు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాద క్షతగాత్రుడు చికిత్స పొందుతూ మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన క్షతగాత్రుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ గ్రామానికి చెందిన తలారి రత్నశేఖర్ (55) శనివారం రాత్రి గ్రామంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా సత్తెనపల్లి నుంచి అచ్చంపేట వైపు స్కూటీపై వెళుతున్న మహిళ ఢీ కొట్టింది. ఈ ఘటనలో రత్నశేఖర్‌కు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన గుంటూరులో ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతునికి భార్య మంజులా రాణి, పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆర్యవైశ్య సంఘం కార్తిక వనసమారాధన



ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని ప్రసన్న షిర్డీసాయిబాబా ఆలయ ఆవరణలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద నున్న మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాయిబాబా గుడి ఆవరణలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు అనుమాలశెట్టి శ్రీరంగనాయకులు, చిలకల సాంబశివరావు, కోటిలింగం, వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సౌర కాంతులు

- పీఎం సూర్య ఘర్ పథకంతో విద్యుత్ బిల్లుల మోతకు చెల్లు
- సోలార్ పద్ధతిలో ఇంటిపైనే విద్యుత్ ఉత్పత్తి
- పవర్ కట్, లోవోల్టేజీ సమస్యలకు చెక్
- సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తున్న కేంద్రం



ఇంటిపై అమర్చిన సోలార్ విద్యుత్ ప్యానల్

బెల్లంకొండ: సూర్యుడు ఉదయించక ముందే ఇంటింటా సౌర కాంతులు వెదజల్లే సమయం వచ్చేసింది. విద్యుత్ కోతలు, సరఫరాలో అంతరాయాలు తొలగించుకునేందుకు మార్గం ఏర్పడింది. పవర్ కట్, లో వోల్టేజీలకు కాలం చెల్లనుంది. ఇంటింటా నిరంతర విద్యుత్ కాంతులకు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'ను అమలులోకి తెచ్చింది. ఈ పథకం ద్వారా విద్యుత్ వినియోగదారులు ఇళ్లపై సోలార్ ప్యానల్స్‌ను అమర్చుకొని విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం ఉంది.

వినియోగదారులను ప్రోత్సహించేలా...

సహజ వనరుల్లో విండ్ పవర్, జియో థర్మల్ పవర్, సోలార్ పవర్ ఇలా ఎన్నో ఉన్నా.. ప్రజలంతా సోలార్ పవర్ సో బెటర్ అంటున్నారు. నీరు, బొగ్గుతో విద్యుత్ తయారు చేస్తున్నప్పటికీ సరిపడా లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలను చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సహజ వనరులైన గాలి, సూర్యరశ్మి ఆధారంగా విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. సాధారణ గృహాలకు కూడా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా 'పీఎం సూర్య ఘర్' పథకాన్ని తీసుకొచ్చింది. ఇంటిపైనే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా రాయితీ అందిస్తూ ప్రోత్సహిస్తుంది.

పథకం పొందండి ఇలా...

పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పొందేందుకు గృహ విద్యుత్ వాడకం 300 యూనిట్ల లోపు ఉండాలి. ఈ పథకం కోసం మొబైల్‌లో సూర్య ఘర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇంటి విద్యుత్ సర్వీస్ నంబర్, వినియోగదారుడి వివరాలు, ఆరు నెలల విద్యుత్ బిల్లుల కాపీలను జత చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

- రిజిస్ట్రేషన్ ఫీజు ఎన్ని కిలో వాట్స్ తీసుకుంటున్నామనే దాన్ని బట్టి ఉంటుంది. ఐదు కిలో వాట్స్‌కు రూ.1,900, అంతకు పైబడితే రూ.5,900, పది కిలో వాట్స్ పైబడిన హెచ్‌టీ సర్వీస్ దారులు రూ.11,800 చెల్లించాలి. మూడు కిలోవాట్స్ లోపు సర్వీసులకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ట్రాన్స్‌కో అనుమతులు పొందిన తర్వాత వెండర్‌లను ఎంపిక చేసుకోవాలి. ఒక కిలోవాట్‌కి రూ.30 వేల చొప్పున కిలోవాట్స్‌ని బట్టి సబ్సిడీ మంజూరు చేస్తారు.

ఆరు నుంచి ఏడేళ్లలో పెట్టుబడిని పొందవచ్చు

విద్యుత్ వినియోగం 300 యూనిట్ల లోపు ఉండాలనే నిబంధన ఉంది. కిలోవాట్‌కు నిర్ణయించిన మేరకు రూ.30 వేల ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు నుంచి రుణం పొందవచ్చు. ఇంటి పై కప్పుపై 100 చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్, ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా వినియోగదారులు వాడుతున్న విద్యుత్‌ను లెక్కించే అవకాశం ఉంటుంది. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి ఆరు నుంచి ఏడేళ్లలో తిరిగి పొందగలరని సోలార్ కంపెనీలు వెల్లడిస్తున్నాయి.

నెల రోజుల్లో సబ్సిడీ చెల్లింపు

సోలార్ ప్యానల్స్, నెట్ మీటర్ అమర్చిన తర్వాత పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది.

- 100 చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కిలోవాట్ సామర్థ్యం గల రూఫ్ టాప్‌కు మూడు లేదా నాలుగు ప్యానల్స్‌ను వినియోగిస్తారు.
- కిలో వాట్ సోలార్ ప్యానల్స్‌కు నెలకు దాదాపు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. 5 కిలో వాట్ సోలార్ ప్యానల్స్‌కు నెలకు 600 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఇందులో 300 యూనిట్లు ఇంటి అవసరాలకు పోగా మిగిలిన 300 యూనిట్లను విద్యుత్ శాఖ కొనుగోలు చేసి, సదరు మొత్తాన్ని వినియోగదారుని బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది.

సోలార్ రూఫ్ టాప్ ప్యానల్స్ రాయితీ వివరాలు...

సామర్థ్యం	విద్యుత్ ఉత్పత్తి	ఖర్చు	రాయితీ
1 కిలోవాట్	120 యూనిట్లు	రూ.60 వేలు	రూ.30 వేలు
2 కిలోవాట్	240 యూనిట్లు	రూ.1.20 లక్షలు	రూ.60 వేలు
3 కిలోవాట్	360 యూనిట్లు	రూ.1.80 లక్షలు	రూ.78 వేలు

సద్వినియోగం చేసుకోండి



విద్యుత్ వినియోగదారులు సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని చేసుకునే పథకం పీఎం సూర్య ఘర్. సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీతో పాటు రుణ సదుపాయం అందిస్తుంది. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి సుమారు ఏడేళ్లలో తిరిగి పొందవచ్చు. నెట్ మీటర్ విధానం ద్వారా విద్యుత్ వినియోగాన్ని తెలుసుకోవచ్చు. ఇప్పటికే ఈ పథకం గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. ఈ పథకానికి సంబంధించి సందేహాలు ఉంటే స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– పి.విజయ్‌కుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్, పల్నాడు జిల్లా

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం గ్రామంలో రెండు ఆలయాల విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభాల ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. గ్రామంలో శ్రీకృష్ణ దేవాలయం, సీతారాముల ఆలయాలను నిర్మించి, విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయాలలో వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రెండు ఆలయాల ప్రతిష్ఠ కావడంతో గ్రామంలో మూడు రోజులుగా పండుగ సందడి నెలకొంది. వేద పండితులు హోమ కార్యక్రమాలు నిర్వహించి, పూజలను చేశారు. ఆదివారం ఉదయం ఆలయాల్లో విగ్రహాలను, ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

రేపు, ఎల్లుండి పొలం పిలుస్తోంది

క్రోసూరు: మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం, బుధవారం పొలం పిలుస్తోంది గ్రామ సభలు జరుగుతాయని ఏవో వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో సస్యరక్షణ, రైతులకు ప్రభుత్వం అందించే పథకాల గురించి వ్యవసాయ అధికారులు వివరిస్తారని తెలిపారు. కావున రైతులు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరుకావాలని కోరారు.

నిత్యావసరాల ధరలు, విద్యుత్ చార్జీలను తగ్గించాలి

సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య



ఇంటింటికీ ప్రజాపోరు ప్రచార యాత్రలో కరపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

సత్తెనపల్లి: నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పేద, మధ్యతరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియా, 28వ వార్డు జెండా చెట్టు, నాగన్నకుంట సెంటర్లలో ఆదివారం జరిగిన సీపీఎం ఇంటింటికీ ప్రజా పోరు ప్రచార యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు లేక నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి కుటుంబాలు గడవటం కష్టంగా ఉన్న నేపథ్యంలో ఇవి చాలవన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజలపై మోయలేని భారాలను మోపిందన్నారు. ఈ నేపథ్యంలో సీపీఎం ప్రజల పక్షాన నిలిచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ప్రజాపోరు ప్రచార కార్యక్రమం చేపట్టిందన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటింటి ప్రజా పోరు ప్రచార యాత్ర చేపట్టి ఈ నెల 14న సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. పట్టణ ప్రజలు పాల్గొని ధర్నా జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, న్యాయవాది పిన్నమనేని పాములయ్య, సీపీఎం నాయకులు పొట్టి సూర్యప్రకాశరావు, జడ రాజ్‌కుమార్, మునగా జ్యోతి, తుమ్మల లక్ష్మి, ఇంజం అరుణ, చందా ఆంజనేయులు, ఇంజం లింగయ్య, పటాన్ షరీఫ్, షేక్ సైదులు, వనమా రామారావు, ధరణికోట పుల్లారావు, అవ్వారు ప్రసాద్ రావు, పులిపాటి రామారావు తదితరులు ఉన్నారు.

పేదలపై భారం సరికాదు



మాట్లాడుతున్న సీపీఐ ఏరియా కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు

అమరావతి: రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తగ్గించటం చేతకాని ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపటం సరికాదని సీపీఐ ఏరియా కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి మండల సీపీఐ కార్యదర్శి కె.చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు విద్యుత్ చార్జీల పెరుగుదలకు నిరసన వ్యక్తం చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని నమ్మబలికి మోసం చేసారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.18 వేల కోట్లు ప్రజలపై భారాన్ని మోపటం దారుణమన్నారు. విద్యుత్ కమిషన్ చెప్పిందన్న సాకుతో విద్యుత్ చార్జీలు పెంచటం తప్పదని చెప్పటం పేదలను మోసం చేయటమేనన్నారు. సరైన దిగుబడి రాక, వచ్చిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు కుమిలిపోతున్నారన్నారు. పత్తి, మిర్చి, అపరాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న విద్యుత్ మీటర్లు పెట్టే యోచన విరమించాలని, విద్యుత్ చార్జీలు తగ్గించి ప్రజలను ఆదుకోకపోతే వామపక్ష పార్టీలు మరో విద్యుత్ పోరుకు సిద్ధమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు బైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ చార్జీలు భారం మోపే ఆలోచన విరమించుకోవాలని, ఈ నెల 11న మంత్రి మండలి సమావేశంలో విద్యుత్ చార్జీల విరమణ ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జె.యుగంధర్, గోపి, కె.మంత్రాలు, నందూరు జోజి తదితరులు పాల్గొన్నారు.

ఆహా.. ఏమా క్రమశిక్షణ



క్రమ శిక్షణంటే వీళ్లదే. ఎంత శ్రద్ధగా ఆటోలో సర్దుకుని ప్రయాణిస్తున్నారో చూడండి. ఆటో వెనుక ముగ్గురు కూర్చుంటే..మరో ఇద్దరిని జాగ్రత్తగా తమపై కూర్చోబెట్టుకుని, గట్టిగా పట్టుకుని ప్రయాణిస్తున్నారు. నిజంగా వీరు మహిళా మణులే. కానీ, కూటి కోసం కూలికి వెళ్లే వీరి ప్రయాణం కొంచెం అటు ఇటు అయితే.. పరిస్థితి ఏంటీ.. ప్రమాదమని తెలిసినా ఆటో వాలాలు మారడం లేదు. ఇంతకన్నా మార్గం ఆ మహిళా కూలీలకు లేదు. ఏకంగా 20 నుంచి 30 మందిని కుక్కి, కనీసం డ్రైవర్ హ్యాండిల్ తిప్పుకునేందుకు వీలు లేకుండా ఆటో తోలుతున్నాడు. దీన్ని చూస్తే.. పుష్పక విమానం కూడా సిగ్గు పడుతుందేమో. మరి మన బాధ్యతగల పోలీసులు ఏమి చేస్తున్నారో...? వారు దాడులు చేసినా.. వీరి తీరు మారడం లేదా..? ప్రమాదం జరిగిన తర్వాతే వచ్చి మృతులు, క్షతగాత్రులు ఎంత మందని కేసులు నమోదు చేసి, విచారిస్తారా..? ముందే అప్రమత్తమై వారించి, నివారిస్తారా.

– పిడుగురాళ్ల

అవకాశం అందిపుచ్చుకునేలా..!

- రెండు రోజులుగా ఓటర్ జాబితాలో సవరణలకు ప్రత్యేక శిబిరాలు
- సత్తెనపల్లి నియోజకవర్గంలోని 274 పోలింగ్ కేంద్రాల్లో 132 దరఖాస్తులు



పట్టణంలోని 71వ పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక శిబిరంలో బీఎల్వో

సత్తెనపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ఓటర్ల ముసాయిదా జాబితా తయారీకి రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. దీని కోసం సత్తెనపల్లి నియోజకవర్గంలోని 274 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. శనివారం ఏఈఆర్వో కేవీఎస్ చక్రవర్తి సత్తెనపల్లి మండలం కంటెపూడి, నందిగామలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై బీఎల్వోలకు సూచనలు చేశారు. ఆదివారం కూడా ఈ ప్రత్యేక శిబిరం కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనిలో భాగంగా శనివారం 36 మంది నియోజకవర్గ వ్యాప్తంగా దరఖాస్తు చేసుకుంటే ఆదివారం 96 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 132 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెలలో 23, 24 తేదీల్లో కూడా ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

నియోజకవర్గంలో ఆదివారం వచ్చిన దరఖాస్తులు ఇలా...

మండలం	ఫారం-6	ఫారం-7	ఫారం-8	మొత్తం
సత్తెనపల్లి టౌన్	03	03	04	10
సత్తెనపల్లి రూరల్	18	21	12	51
ముప్పాళ్ళ	05	04	04	13
రాజుపాలెం	02	03	04	09
నకరికల్లు	04	03	06	13
మొత్తం	32	34	30	96

పోలింగ్ కేంద్రాల వద్ద దరఖాస్తుల స్వీకరణ

గతంలో జారీ అయిన ఓటర్ కార్డులో చిరునామా, ఇతర వివరాలు తప్పుగా నమోదైతే వాటి మార్పు కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు. కొత్తగా వచ్చిన వారి వివరాలను నమోదు చేసుకుంటారు. ఎవరైనా మృతి చెందితే ఆ వివరాలు నమోదు చేసుకొని తుది జాబితాలో వారి పేర్లను తొలగిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్వోలు ప్రత్యేక శిబిరాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రత్యేక శిబిరం ఈ నెల 23, 24న కొనసాగుతాయని అధికారులు తెలిపారు. మిగిలిన రోజుల్లో బీఎల్వోలను కలిసి దరఖాస్తులు అందజేయవచ్చు.

యువత సద్వినియోగం చేసుకోవాలి

2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. జనన ధ్రువీకరణ పత్రం లేదా పదో తరగతి మార్కుల జాబితా, చిరునామా ధ్రువీకరణ, ఆధార్ కార్డుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జత చేసి దరఖాస్తు సమర్పించాలి. చిరునామా మార్చుకోవడానికి ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పాత ఓటర్ కార్డుతో పాటు కొత్త చిరునామాతో ఉన్న ధ్రువ పత్రాలను జత చేయాలి.

ఉచిత కంప్యూటర్ శిక్షణ



మాచర్ల: విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు ప్రస్తుత కాలంలో కంప్యూటర్ ఎంతగానో ఉపయోగపడుతోందని శ్రీ రామకృష్ణ సేవా సమితి కన్వీనర్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీశైలం రోడ్డులోని స్వామి వివేకానంద సేవా శ్రమంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తమ సేవా సంస్థ ద్వారా ఏటా ఉచితంగా కంప్యూటర్ శిక్షణనిస్తున్నామన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరముందన్నారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ నాగ సురేష్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

తహసీల్దార్ అష్రఫున్నీసా బేగం



దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్

బెల్లంకొండ: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని తహసీల్దార్ అష్రఫున్నీసా బేగం తెలిపారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ, న్యూ చిట్యాల, మాచాయపాలెం గ్రామాలలో శిబిరాలకు వెళ్లి ఆమె పరిశీలించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరాలలో మండల వ్యాప్తంగా చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఫారం-7 దరఖాస్తులు 9, కొత్త ఓట్లు నమోదుకు ఫారం-6 దరఖాస్తులు 12 వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వెంకయ్య, లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది ధర్మ, సచివాలయ సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సాగర్‌మాత దేవాలయంలో తేరు ప్రదక్షిణ

విజయపురిసౌత్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ సర్వ మానవ పాపాలను తొలగించేందుకు దైవ కుమారుడైన ఏసుక్రీస్తు మానవ రూపాన్ని ధరించి, సమస్త జీవకోటి ఆచరించాల్సిన విధివిధానాలను వెలుగులోకి తెచ్చారని వెల్లడించారు. ఏసుక్రీస్తు సూచించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. దైవ సందేశాన్ని పాటించి సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందాలని చెప్పారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు తల నీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. తేరు ప్రదక్షిణ లో భక్తులు భారీగా పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు



మాచర్ల: వాసవి క్లబ్ ప్రపంచంలోని అనేక దేశాల్లో ఏటా సేవా కార్యక్రమాల ద్వారా పేద, మధ్య తరగతి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కోదండ రామాలయంలో ఉచిత మెగా చెస్ పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, రంగా చెన్నయ్య ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ చెస్ పోటీలు ఆడటం వల్ల మేధాశక్తి పెరుగుతుందన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, సెక్రెటరీ పందిరి నరసింహారావు, ట్రెజరర్ చుండూరు సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ బచ్చు రాజ్ కుమార్, మాస్టర్ కిరణ్, చెంచిరెడ్డి, యూనివర్సల్ ఫౌండేషన్ ఫౌండర్ ఆవుల అంజి విద్యార్థులు పాల్గొన్నారు.